## క్లుప్తంగా

### ఉత్తమ ఉద్యోగులకు సన్మానం



డిప్యూటీ ఎంపీడీఓ దాస్‌కు సన్మానిస్తున్న తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్

బొమ్మనహాళ్: స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో మంత్రి పయ్యావుల కేశవ్, ఇన్‌చార్జ్ కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్న డిప్యూటీ ఎంపీడీఓ దాస్, సర్వేయర్ నాగరాజు, వీఆర్వో కిరణ్‌ను తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్, సిబ్బంది సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ హనుమంతప్ప, ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్వోలు నరసింహమూర్తి, సుజాత, యుగంధర్, శృతి తదితరులు పాల్గొన్నారు.

### ఎంఎల్‌హెచ్‌పీకి సన్మానం



ఉత్తమ అవార్డు గ్రహీత సుధామాధురిని సన్మానిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని గంజికుంట ఎంఎల్‌హెచ్‌పీ సుధామాధురిని సోమవారం సన్మానించారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో మంత్రి పయ్యావుల చేతులమీదుగా సుధామాధురి ఉత్తమ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోతి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### పంటనష్ట పరిహారం అందించాలి



ఈడీటీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఉరవకొండ రూరల్: మండలంలోని భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించాలని సీపీఎం నాయకులు మధుసూదన్, రంగారెడ్డి తెలిపారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వారు ఈడీటీ వరప్రసాద్‌కు విన్నవించారు. వారు మాట్లాడుతూ బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ పూర్తిగా దెబ్బతినిందన్నారు. వ్యవసాయాధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి, రైతులకు పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### సైన్స్‌ఫేర్‌లో శిశుమందిరం విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: హిందూపురంలో జరిగిన సైన్స్‌ఫేర్, మ్యాథమెటిక్స్ పోటీల్లో రాయదుర్గం విద్యా మందిరం విద్యార్థుల ప్రతిభ కనబరిచారు. మోడల్ బెస్ట్ టైప్ ఆఫ్ ఫోర్స్ అంశంలో 5వ తరగతి విద్యార్థిని ఎన్.హర్షిత, మోడల్ బేసిక్ ఆపరేటర్లలో 5వ తరగతి విద్యార్థిని వైష్ణవి ప్రథమ బహుమతి, సైన్స్‌ఫేర్‌లో గీత రెండో బహుమతి సాధించినట్లు పాఠశాల కమిటీ అధ్యక్షుడు ధనార్జున, హెచ్ఎం రాజేశ్వరి తెలిపారు.

### నేటి నుంచి రథోత్సవం

వజ్రకరూరు: కొనకొండ్లలోని ఆది చెన్నకేశవ స్వామి రథోత్సవం ఈనెల 19 నుంచి ప్రారంభం కానుంది. సోమవారం ఆలయ ఈఓ అంగడాల కృష్ణయ్య ఏర్పాట్లను పరిశీలించారు. ఈఓ మాట్లాడుతూ మంగళవారం ఉదయం ధ్వజారోహణం, అభిషేకం, నవగ్రహ పూజా హోమం, అదేరోజు రాత్రి 8 గంటలకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీదేవి,భూదేవి సమేత ఆదిచెన్నకేశవస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. 20న ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, 11 గంటలకు పల్లకీ సేవ, మడుగుతేరు, సాయంత్రం 5 గంటలకు ఉట్ల ఉత్సవం, రథోత్సవం , 21న అభిషేకం, పల్లకీసేవ, వసంతోత్సవం, రాత్రికి పల్లకీసేవ జరుగుతుందన్నారు.

### 22న విత్తన వరి వేలం


కణేకల్లు: కణేకల్లు అగ్రికల్చర్ ఫాంలో 184.21 క్వింటాళ్ల రిజక్షన్ (తిరస్కరణ) సీడ్ ఈనెల 22న వేలం వేస్తున్నట్లు ఏడీఏ నారాయణనాయక్ తెలిపారు. ఎస్ఎస్ఎంఎఫ్, పీడీడీఎఫ్ ఫాంలో పండించిన విత్తన వరిధాన్యాన్ని ప్రాసెసింగ్ చేయగా 184.21 క్వింటాళ్ల విత్తన వరి రిజక్షన్ అయ్యిందన్నారు. వీటిలో బీపీటీ–5204, బీపీటీ–2846 రకం వరి ఉందన్నారు. అనంతపురంలోని ప్రసన్నాయనపల్లెలోని ఏపీసీడ్స్ కార్యాలయంలో 22న ఉదయం 11 గంటలకు వేలం పాట ఉంటుందన్నారు. పాల్గొనదలిచిన వారు అసిస్టెంట్ డైరెక్టర్ ఫాం ఎస్ఎస్ఎంఎఫ్ సేల్స్ ప్రొసీడ్స్ పేరున రూ.50 వేలు డీడీ తీయాలన్నారు. డీడీలను స్థానిక అగ్రికల్చర్ ఫాంలో అందజేయాలని, లేదా డీడీతో సహా వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

# డ్యాంలకు నీరు.. పనుల జోరు

- ప్రాజెక్టుల్లోకి వరదనీటి ప్రవాహం
- నిండుకుండల్లా బీటీపీ,తుంగభద్ర డ్యాంలు
- 75,500 క్యూసెక్కులతో కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- 1.05 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల



నిండుకుండలా తొణికిసలాడుతున్న బీటీ ప్రాజెక్ట్



టీబీ డ్యాం నుంచి 22 క్రస్ట్ గేట్లు తెరవడంతో దిగువకు పోతున్న నీరు

రాయదుర్గం: తుంగభద్ర జలాశయానికి వరదనీరు పోటెత్తుతోంది. రిజర్వాయర్ ఎగువ ప్రాంతాల్లోని శివమొగ్గ, ఆగుంబె, తీర్థహళ్లి, సాగర, హొసనగర, కడూరు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగ, భద్ర నదులు ఏకమై దిగువకు పరవళ్లు తొక్కుతున్నాయి. దీంతో రిజర్వాయర్ నిండుకుండలా తొణికిసలాడుతోంది. గేట్ల భద్రత దృష్ట్యా 105.788 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని 80 టీఎంసీలకు కుదిస్తూ టీబీ బోర్డు నిర్ణయించింది. సోమవారం 75,500 క్యూసెక్కులతో మొదలైన ఇన్‌ఫ్లో గంట, గంటకు ఎక్కువై 80 వేలకు చేరింది. ప్రస్తుతానికి 77.012 టీఎంసీల నీటి స్టోరేజీ ఆధారంగా 1.05 లక్షల క్యూసెక్కుల నీటిని 22 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు విడుదల చేశారు. టీబీ బోర్డు తొలి సమావేశంలో కృష్ణ బేసిన్‌లో నీటి లభ్యత అంచనా మేరకు 18.369 టీఎంసీలు హెచ్ఎల్‌సీకి కేటాయించారు. అంచనాకు మించి డ్యాంలోకి వరదనీటి ప్రవాహం కొనసాగుతుండడంతో 24.068 టీఎంసీలకు పెంచారు. దీంతో లక్ష ఎకరాలకు సాగునీరందించేలా కార్యచరణ చేపట్టారు. ప్రస్తుతానికి డ్యాం నుంచి హెచ్ఎల్‌సీ ద్వారా 2 వేల క్యూసెక్కుల నీరు డ్రా చేస్తున్నారు. వాటిని హెచ్ఎల్ఎంసీ, జీబీసీ పరిధిలోని ఆయకట్టుకు వినియోగిస్తున్నారు. ఎంపీడ్యాం నార్త్, సౌత్, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌కు నీటిని విడుదల చేయాల్సి ఉంది.

**జోరందుకున్న పనులు**

తుంగభద్ర జలాశయం నుంచి నీరు విడుదల కావడంతో ఆయకట్టులో ఎటుచూసినా పనులు జోరందుకున్నాయి. బోర్ల కింద వరినార్లు పెంచుకున్న రైతులు నాట్లు వేసుకుంటున్నారు. మరి కొందరు నారు పోసుకుని పిట్టమడులు సిద్ధం చేసుకుంటున్నారు. సరిపడా ఎరువులు, విత్తనాలు సరఫరా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

**చిగురిస్తున్న ఆశలు**

జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన బైరవాని తిప్పా (బీటీపీ) ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. కర్నాటక రాష్ట్రంలో కురుస్తున్న బారీ వర్షాలకు వేదావతి హగరి పరవళ్లు తొక్కింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1655 అడుగులు కాగా, సోమవారం సాయంత్రానికి 1653.2 అడుగులకు వరదనీరు చేరింది. పూర్తిస్థాయి నీటి మట్టానికి 2.8 అడుగులు మాత్రమే అవసరం కానుంది. ప్రస్తుతానికి 338 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.

**ఆయకట్టు రైతుల్లో చిగురించిన ఆశలు..**

ఖరీఫ్‌లో ఇప్పటికే పంటల సాగు చేపట్టారు. దీంతో రబీలో నీటి విడుదలకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రోటేషన్ పద్ధతిలో భాగంగా రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని గుమ్మఘట్ట మండలం ప్రధాన ఎడమ కాలువ పరిధిలో 1 నుంచి 12వ డిస్ట్రిబ్యూటర్ వరకు సుమారు 4,200, బ్రహ్మసముద్రం మండలంలోని కుడి కాలువ పరిధిలో 6బీ చెలిమేపల్లి నుంచి 8బీ బుడిమేపల్లి వరకు సుమారు 1500ల ఎకరాలకు సాగునీరు విడుదల చేసే అవకాశం ఉందని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. డిసెంబర్ మొదటి వారంలో పంటకు నీటిని విడుదల చేస్తారు. దీంతో బీడుబారిన పొలాలను రైతులు శుభ్రం చేసుకునే పనిలో పడ్డారు.

### ముందస్తుగానే నిండింది



బీటీప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. ఈ ఏడాది ముందస్తుగానే వరద నీటి తాకిడి మొదలైంది. డిసెంబర్‌లో ఆయకట్టు సమావేశం నిర్వహించి, రొటేషన్ పద్ధతిలో నీటి విడుదల చేపడతాం. పూర్తిస్థాయి నీటి మట్టానికి మరో 3 అడుగు మాత్రమే అవసరం కానుంది. ప్రాజెక్టు వద్ద విద్యుద్దీకరణ, జనరేటర్ రూం, కాంపౌండ్‌వాల్ లాంటి పనులు కొనసాగుతున్నాయి. కాలువలు మరమ్మతులు పై దృష్టి సారిస్తాం.

– బలరాముడు, మైనర్ ఇరిగేషన్ డీఈ, రాయదుర్గం

### ఇబ్బందుల్లేకుండా సాగునీరిస్తాం

హెచ్ఎల్‌సీ ఆయకట్టు పరిధిలో ఇబ్బందుల్లేకుండా సమృద్ధిగా సాగునీరందించేలా చర్యలు చేపట్టాం . ఇప్పటికే హెచ్ఎల్ఎంసీ, జీబీసీ ఆయట్టుకు సాగునీరందుతోంది. ఎంపీడ్యాం నార్త్, సౌత్, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌కు నీటిని విడుదల చేయాల్సి ఉంది. త్వరలో ఆ ప్రాంత ఆయకట్టుకు నీటిని సమకూర్చుతాం.

– వెంకటేశ్వర్లు, హెచ్ఎల్‌సీ ఈఈ, అనంతపురం

## కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు



వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకురాలు శ్రీదేవి, నియోజవర్గ నాయకురాళ్లు చందన శివాజీ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, ఎంపీపీ మారుతమ్మ, నాగలక్ష్మి విమర్శించారు. ఇటీవల భర్త, అత్తమామలు వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న శ్రావణి ఆత్మకు శాంతి కలగాలని పట్టణంలోని టీసర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు శ్రావణి చిత్రపటంతో కొవ్వొత్తులతో సోమవారం ర్యాలీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకురాళ్లు మాట్లాడుతూ పట్టణానికి చెందిన శ్రావణి గర్భిణి అని, అత్తింటి వారి వేధింపులు తాళలేక పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. అయితే నిందితులు టీడీపీ వారు కావడంతో ఆమె ఫిర్యాదును పట్టించుకోలేదన్నారు. టీడీపీ నేతలు, పోలీసులు కలిసి శ్రావణిని హత్య చేశారన్నారు. శ్రావణి ఆత్మహత్యకు కారకుల పేర్లు తన ఫోన్లో రికార్డు చేసిందని, వాటి ఆధారంగా నిందితులను అరెస్టు చేయకుండా పోలీసులు కేసు పక్కదారి పట్టించారని విమర్శించారు. శ్రావణి ఆత్మహత్యకు కారకులైన టీడీపీ నేతలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నారాయణపురం వెంకటేశులు, యువజన విభాగం రాష్ట్ర నేత రామాంజనేయులు, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ నీరుగంటి మమత సురేష్, మహిళా విభాగం శోభారాణి, భారతి, అనురాధ, మహేశ్వరి, ఎంపీటీసీ మాధవి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, మండల కన్వీనర్లు గోళ్ల సూరి, హనుమంతరాయుడు, ఈడిగ సుధీర్, చంద్రశేఖర్, కౌన్సిలర్ లక్ష్మన్న, నాయకులు బిక్కి హరి, అంజి, మల్లి, బోరంపల్లి రామిరెడ్డి, పాండు, షేక్షావలి, టైలర్ శీన, రిజ్వాన, శ్రీకాంత్, వనజాక్షి, సునిత, మంజుళ,, లత, ఉమ, తదితరులు పాల్గొన్నారు.

## రైతులందరికీ యూరియా అందిస్తాం

సాక్షి ఎఫెక్ట్..



మాట్లాడుతున్న ఏడీఏ పద్మ, తహసీల్దార్ మునివేలు

బొమ్మనహాళ్: యూరియా కోసం రైతులు ఎవరూ ఆందోళన చేయాల్సిన అవసరం లేదు.. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని ఏడీఏ పద్మజ అన్నారు. సోమవారం 'సాక్షి'లో 'యూరియా..ఏదయ్యా' శీర్షికన కథనం ప్రచురితమైంది. జిల్లా వ్యవసాయాధికారుల ఆదేశాల మేరకు బొమ్మనహాళ్ రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ మునివేలు, ఏఓ సాయికుమార్‌తో కలిసి వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి. యూరియా లేదనే కొందరు దుష్ప్రచారం చేశారని, దీంతో రైతు సేవా కేంద్రాల ముందు రైతులు బారులు తీరుతున్నారని అన్నారు. గతంలో మాదిరి పెద్ద మొత్తంలో సొసైటీలు, రైతు సేవా కేంద్రాల్లో యూరియా నిల్వ లేకపోవడంతోనే రైతుల్లో ఈ ఆందోళన నెలకొందని ఏడీఏ అన్నారు. గ్రామాల్లో రైతులకు యూరియా అందరికీ ఇస్తామని భరోసా కల్పించాలని వీఆర్వోలకు ఏడీఏ, తహసీల్దార్ సూచించారు. ఒక రైతు సేవా కేంద్రానికి 280 బస్తాలు రావడంతో రైతులందరు ఒకేసారి కేంద్రం వద్దకు రావడంతో రైతులను తిరిగి పంపించకుండా రెండు బస్తాలు ఇచ్చి, పంపిణీ చేసినట్లు తెలిపారు. మండలంలో ఐదు రోజుల్లో 88 టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో శ్రీధరఘట్ట, ఏలంజి, గోనేహాళ్, దర్గాహొన్నూరు రైతు సేవా కేంద్రాలకు 12 టన్నుల చొప్పున వస్తుందన్నారు. సమావేశంలో ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్వోలు నరసింహమూర్తి, యుగంధర్, శృతి, నరసింహారావు తదితతరులు పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధి, భవిష్యత్‌పై మాస్టర్‌ప్లాన్



మాస్టర్‌ప్లాన్ ముసాయిదా సలహాలు, సూచనలపై జరిగిన అవగాహన సదస్సు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పట్టణాభివృద్ధి, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ ముసాయిదాలోని ప్రతి అంశాన్ని పరిశీలించి, ప్రజలు తగు సలహాలు, సూచనలు చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప కోరారు. సోమవారం స్థానిక సీతారామ కల్యాణ మంటపంలో నూతన మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్ (ముసాయిదా)పై అవగాహన సదస్సు జరిగింది. సమావేశానికి పట్టణ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాన్ని అందంగా, సౌకర్యంగా తీర్చిదిద్దేందుకు ముసాయిదాలో ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. రోడ్ల విస్తరణ, నివాస, వాణిజ్య, పరిశ్రమలకు అనువైన ప్రాంతాలను విభజించినట్లు తెలిపారు. ముసాయిదాలో పొందుపరిచిన అనంతపురం ప్రధాన రహదారి 80 నుంచి 100 అడుగులు, బైపాస్, బళ్లారి రోడ్డు విస్తరణలపై ప్రజలు అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహసీల్దార్ నాగరాజు, ఆర్అండ్‌బీ డీఈ రవిశంకర్, టీపీఎస్ మురళి, కౌన్సిలర్లు అరవ రేఖా, శారదదాదేవి, పొరాళ్ల గోవిందరాజులు, శివపుత్ర సంజీవ, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, శివప్ప, నిజాముద్దీన్, బషీర్ అహ్మద్, రామాంజనేయులు, మాజీ కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యతకు ప్రతీక బీబీ జైనబ్బీ దర్గా

- 20 నుంచి అమ్మవారి ఉరుసు
- రాష్ట్రంలోనే ఏకైన అమ్మవారి దర్గాగా గుర్తింపు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారి జీవసమాధి

ఉరవకొండ: కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పేరున్న ఉరవకొండ హజరత్ బీబీ జైనబ్బీ ఉరుసు ఈనెల 20 నుంచి ప్రారంభం కానుంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉరవకొండలో మాత్రమే అమ్మవారి దర్గా ఉండటం విశేషం. హిందూ–ముస్లింల ఐక్యతకు ప్రతీకగా అమ్మవారు భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది.

**ఎన్నో ప్రత్యేకతలు:**

బీబీ జైనబ్బీ అమ్మవారి దర్గా ప్రత్యేకతలకు నెలవుగా పేరొందింది. అపురూప శిల్పకళతో విరాజిల్లుతోంది. అరబ్ దేశంలోని మక్కా ప్రాంతంలో ఏర్పాటు చేసిన జన్నత్‌దాదర్వాజ (స్వర్గద్వారం )ను పోలిక కట్టడాన్ని కర్ణాటక ప్రాంతానికి చెందిన కళాకారులతో ఏర్పాటు చేయించారు. దీంతో పాటు కర్ణాటకలోని గుల్బర్గాలోని ఖాజబందేనవాజ్ దర్గా తరహాలో ఉన్న గాజు గోపురాన్ని రూపొందించారు. అజ్మీర్‌లోని ఖాజగరీబ్ నవాజ్ దర్గాలోని దేగ్‌ను అదే తరహాలో రూ.4 లక్షలు వెచ్చించి జైనబ్బీ దర్గాలో ఏర్పాటు చేశారు. దర్గా శిఖర కలశం ఆకట్టుకుంటోంది.

**20 నుంచి ఉత్సవాలు ప్రారంభం:**

జైనబ్బీ అమ్మవారి ఉత్సవాలు ఈనెల 20 నుంచి ప్రారంభమవుతాయని దర్గా కమిటీ అధ్యక్షులు హోతూరు బాషా, కమిటీ సభ్యులు తెలిపారు. 20న అమ్మవారి గంధం వేడుకలు స్థానిక అల్లప్పరెడ్డి ఇంటి నుంచి బయల్దేరి మెయిన్ బజార్ వద్ద హుసేన్ పీరా సాబ్ ఇంటి వద్ద చేప దేవుడి గుడి నుంచి గంధం భారీ ఊరేగింపుతో దర్గాకు చేరుతుంది. 21న అమ్మవారి షంషేరు వేడుకలు వైభవంగా జరగనున్నాయి. 22న అమ్మవారి జియారత్ వేడుకలతో ఉత్సవాలు ముగుస్తాయి. దీంతో పాటు మేజర్ పంచాయతీ కార్యాలయం నుంచి చాదర్ ఊరేగింపుతో పాటు ప్రముఖ ఖవ్వాలి పోటీదారుల మధ్య ఖవ్వాలి పోటీలు జరగనున్నాయి.

### తప్పుల్లేని జాబితా తయారు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఓ రవిశంకర్‌రెడ్డి

రాయదుర్గం: స్థానిక సంస్థల ఎన్నికల్లోపు తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయాలని వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివా, కౌన్సిలర్ గోవిందరాజులు, మైనార్టీ అధ్యక్షుడు బసీర్, యువజన నాయకుడు అరవిందబాబు లు ఎన్నికల రిటర్నింగ్ (ఆర్ఓ) అధికారి రవిశంఖర్‌రెడ్డికి విజ్ఞప్తిచేశారు. సోమవారం స్థానిత తహసీల్దార్ కాన్ఫరెన్స్‌హాల్ లో తహసీల్దార్ నాగరాజు, ఈడీటీ సుజాతతో కలసి అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పలు సమస్యలను ప్రస్తావించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఏ వార్డులో అయితే ఓటరుగా ఉంటారో అక్కడే ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. టీడీపీ నాయకుడు పీ నాగరాజు పలు సమస్యలను ఆర్ఓ దృష్టికి తీసుకెళ్లారు. సీపీఐ, సీపీఐ, బహుజన పార్టీ నాయకులు వారి దృష్టికి వచ్చిన సమస్యలను వివరించారు.

### బీటీపీకి చేరుతున్న వరదనీరు

గుమ్మఘట్ట: గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం మండలాలకు వరప్రదాయినిగా ఉన్న బైరవానితిప్ప ప్రాజెక్టుకు వరదనీరు కొనసాగుతోంది. జలాశయానికి ఇన్‌ఫ్లో 333 కూసెక్కుల నీరు వస్తున్నట్లు జలవనరుల శాఖ ఏఈ హరీష్ తెలిపారు. ప్రస్తుతం 1,651.6 అడుగులకు నీరు చేరినట్లు తెలిపారు.

### 22న పెన్నహోబిలంలో వేలం

ఉరవకొండ రూరల్: పెన్నహోబిలం లక్ష్మీన్రసింహస్వామి ఆలయంలో ఈ నెల 22న తలనీలాలు, వంట పాత్రల అద్దె ఇచ్చే హక్కు, బియ్యంబేడల సేకరణ హక్కులకు బహిరంగ వేలం వేస్తున్న ట్లు ఆలయ ఈఓ రమేష్ బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

**రేపు సీతాఫలసాయం వేలం**

గుమ్మఘట్ట: రాయదుర్గం మండలంలోని మెచ్చిరి గ్రామ పరిసర ప్రాంతాల్లోని సీతాఫలసాయాన్ని ఈ నెల 20న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని రచ్చకట్ట వద్ద జరిగే వేలంలో పాల్గొనదలిచిన వారు రూ.500 ధరావత్తు చెల్లించాలన్నారు.

**ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు**

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం సచివాలయంలో ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. ఈ నెల 19 నుంచి 30 వరకు ఆధార్ కేంద్రం కొనసాగుతుందన్నారు. జాబితాలో పేర్లు ఉన్న (5–15 ఏళ్లలోపు) విద్యార్థులందరితో పూర్తి చేయించాలని ఆయన తెలిపారు.

**పోలీస్ సైరన్‌తో దుండగుల ఉడాయింపు**

డి హీరేహాళ్ (రాయదుర్గం): డి హీరేహాళ్‌లోని వెల్డింగ్ దుకాణంలోకి ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. దుకాణంలోని విలువైన వైర్లు, ఇతర సామగ్రి మూటకట్టుకట్టి కారులోకి ఉంచారు. హడావుడిలో కారు బురదలో ఇరుక్కుంది. ఆ సమయంలో పోలీస్ వాహనం సైరన్ మోగింది. పోలీసులకు దొరికిపోతామేమోనని కారు అక్కడే వదిలి దుండగులు పరారయ్యారు. కారుతోపాటు మూటకట్టి ఉంచిన సామగ్రిని సీజ్ చేశామని ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు.

### సంక్షిప్త సమాచారం

**కమ్యూనిటీ సెంటర్‌ను కూల్చేయండి**

రాయదుర్గంటౌన్: మండలంలోని 74 ఉడేగోళంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీ భవనాన్ని కూల్చివేయాలని హెచ్ఎం, ఉపాధ్యాయులు ఎంపీడీఓ కొండన్నకు సోమవారం విన్నవించారు. ఉపాధ్యాయులు సునీల్, వాణి, అరుణ, రాజ్యలక్ష్మి, శైలజ, సీఆర్‌పీ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

బొమ్మనహాళ్: కల్లుదేవనహళ్లికి చెందిన హరిజన తిప్పన్న (54) బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపిన మేరకు.. తిప్పన్న కల్లుహాళ గ్రామానికి చెందిన పాటిల్ హరిష్ ద్విచక్ర వాహనాలు గోవిందవాడ క్రాస్ వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తిప్పన్నకు తలకు బలమైన గాయమైంది. బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య యల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

**రైతు సేవా కేంద్రం ప్రారంభం**

గుమ్మఘట్ట: మండలంలోని బీటీపీని రైతు సేవా కేంద్రాన్ని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సోమవారం ప్రారంభించారు. రైతులకు అందుబాటులో ఉండి సత్వరం సేవలు అందించాలని సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు. 52 మందికి పొజిషన్ పట్టాలు అందించారు. తహసీల్దార్ రజాక్‌వలీ, ఎంపీపీ భవాని , ఎంపీడీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**పార్వతీ పరమేశ్వరుడికి విశేష పూజలు**

కూడేరు: కూడేరు స్వయంభు జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వరులకు శ్రావణమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జోడు లింగాల దర్శనార్థం పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. పార్వతీ పరమేశ్వరులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శివనామస్మరణ మార్మోగింది. పోనుగంటి ఆర్యవైశ్య సంఘం అన్నదానం చేసింది.

**నేడు నాగిరెడ్డిపల్లిలో మారెమ్మ జాతర**

బ్రహ్మసముద్రం : నాగిరెడ్డిపల్లిలో వెలసిన గ్రామ దేవత మారెమ్మ దేవి జాతర మంగళవారం నిర్వహించనున్నారు. ఏటా శ్రావణ మాసంలో ఆఖరి మంగళవారం అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీ. శ్రావణ మాసంలో మాంసాహారం ముట్టరు. కానీ ఈ గ్రామంలో శ్రావణ మాసంలోనే అమ్మవారికి జంతుబలి ఇస్తారు. గ్రామంలో మొదటగా మారెమ్మ జాతర నిర్వహించడం ప్రత్యేకం. ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు.

## ఆర్డీటీ సేవలు పునరుద్ధరించే వరకు ఉద్యమం



ఉరవకొండలో ర్యాలీ చేస్తున్న ప్రజా, కులసంఘాల నాయకులు



శెట్టూరులో తహసీల్దార్ ఈశ్వరమ్మకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించే వరకు ఉద్యమం ఆగదని ఆర్‌డీటీ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ సాకే హరి తెలిపారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి ఎస్సీ, ఎస్టీ కుల సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆర్‌డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ చేశారు. సాకే హరి మాట్లాడుతూ ఆర్డీటీని కాపాడుకోవడమే అందరి బాధ్యత అన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్తూరు ఆనంద్, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**ఆర్డీటీని పరిరక్షించాలని నిరసన**

శెట్టూరు: ఆర్డీటీ సేవలు పునరుద్ధరించాలని ఆర్డీటీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. మండల కేంద్రంలో ర్యాలీ చేశారు. ఆర్డీటీ పాఠశాలతో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఫాదర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ ఈశ్వమ్మకు వినతిప్రతం అందించారు. కార్యక్రమంలో శెట్టూరు, కుందుర్పి, బ్రహ్మసముద్రం మండాల నుంచి ఆర్డీటీ పరిరక్షణ జేఏసీ సభ్యులు, మహిళా సంఘాలు సభ్యులు పాల్గొన్నారు.

### వైభవంగా కృష్ణభగవానుడి ఊరేగింపు



శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

ఉరవకొండ: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడిని సోమవారం ఊరేగించారు. స్థానిక వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద కృష్ణాష్టమిని పురస్కరించుకొని శ్రీకృష్ణుడి విగ్రహన్ని కొలువుదీర్చి, ఊరేగించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత సేవాసమితి నిర్వాహకులు రామాంజనేయులు, వీరేంద్ర, శేఖర్, శివ, యల్లమ్మ, ఉమాదేవి, సుమతి, హైమవతి, సువర్ణ, ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

### అష్టోత్తర లింగ అలంకరణ పూజలు



అష్టోత్తరలింగ అలంకరణలో రామేశ్వరస్వామి

బెళుగుప్ప: మండల కేంద్రంలోని రామేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ సోమవారం పురస్కరించుకుని అష్టోత్తర లింగ అలంకరణ పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయంలో రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శ్రావణమాస చివరి సోమవారం కావడంతో అష్టోత్తర లింగ అలంకరణలో స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు.

### వైభవంగా దొణగంగమ్మ జాతర





టీ.వీరాపురం సమీపంలో దొణవద్ద పూజలు చేస్తున్న భక్తులు

గుమ్మఘట్ట: రాయదుర్గం మండలం టీ.వీరాపురం సమీపంలో వెలసిన దొణ గంగమ్మ జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రావణ సోమవారం సందర్భంగా అమ్మవారికి ఆలయంలో వేకువజాము నుంచి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించిన రథంలో కొలువుదీర్చి ఊరేగించారు. తిరిగి సాయంత్రం రథాన్ని ఆలయం వద్దకు లాగారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దొణచుట్టు వృషభాలను ప్రదక్షిణలు చేయించారు. అర్బన్ సీఐ జయానాయక్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

### భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు



జంబుకేశ్వరస్వామిని నల్లద్రాక్ష పండ్లతో అలంకరించిన దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని శైవక్షేత్రాలతో పాటు అమ్మవారి ఆలయాలు, ప్రముఖ ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామి ఆలయంలో నల్లద్రాక్షలతో మూలవిరాట్‌ను అలంకరించి, పూజలు చేశారు. మహాలక్ష్మి, వరమహాలక్ష్మి ఆలయాల్లో శ్రావణ సోమవారం సందర్భంగా పూజలు జరిపారు. నాగులకట్టల వద్ద మహిళలు హాజరై పాలు పోసి పూజలు చేశారు.

### నేడు తలారి రంగయ్య పర్యటన

బ్రహ్మసముద్రం : పొబ్బర్లపల్లి, పోలేపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య పర్యటించనున్నారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు పొబ్బర్లపల్లి, మధ్యాహ్నం 12.30 గంటలకు పోలేపల్లి గ్రామంలో ' రీకాలింగ్ చంద్రబాబూస్ కార్యక్రమం, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీల ఏర్పాటు చేయనున్నారు.